పట్టభద్రుల ఓటరు నమోదుకు కౌంటర్ ఏర్పాటు

బోథ్/తాంసి/భీంపూర్, అక్టోబర్ 4 : ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కోసం బోథ్, తాంసి, భీంపూర్ తహసీల్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్లు సుభాష్ చందర్, లక్ష్మి, నలందప్రియ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌంటర్‌లో ఫారం-18,19 తీసుకుంటారని పేర్కొన్నారు. డిగ్రీ మెమో లేదా ప్రొవిజనల్ సర్టిఫికెట్, ఓటర్ ఐడీ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, ఈ మెయిల్ ఐడీ వెంట తీసుకురావాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో సహకార ఉద్యోగికి గాయాలు

తాంసి/భీంపూర్, అక్టోబర్ 4: భీంపూర్ మండలం కరంజి(టీ) గ్రామానికి చెందిన కర్నేవార్ గణేశ్ పీఏసీఎస్‌లో కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. శుక్రవారం ఉదయం తాంసి పీఏసీఎస్‌లో విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తుండగా తలమడుగు మండలం ఖోడద్ మూల మలుపు వద్ద కుక్కలు అడ్డం రాగా అదుపుతప్పి కింద పడిపోయాడు. తల భాగంలో తీవ్ర రక్తస్రావమై స్పృహ తప్పి పడిపోయాడు. ఆ సమయంలో ఆ వైపు వస్తున్న ఆర్ఐ అశోక్, రవికాంత్, శ్రీనివాస్ 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తర్వాత హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. ఆయనను డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి , సీఈవోలు కేశవ్, శ్రీనివాస్, కార్యదర్శులు, డైరెక్టర్లు ఏనుగు అశోక్‌రెడ్డి పరామర్శించారు . ప్రభుత్వపరంగా మెరుగైన చికిత్స అందేలా చూస్తామన్నారు. చైర్మన్, సీఈవోలు, ఉద్యోగులు చికిత్స కోసం ఆర్థిక చేయూతనిచ్చారు. మంచి ఉద్యోగిగా పేరున్న గణేశ్ కోలుకోవాలని డీసీసీబీ చైర్మన్ ఆకాంక్షించారు.

కొండ సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

ఎదులాపురం, అక్టోబర్ 4 : మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. సినిమా రంగాన్ని రాజకీయాల్లోకి లాగి సమంత-నాగచైతన్య కేటీఆర్ వల్లనే విడిపోయారని మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. మంత్రిపై కాంగ్రెస్ అధిష్ఠానం గానీ, సీఎం రేవంత్‌రెడ్డి గానీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంపై ఏ మాత్రం గౌరవమున్నా ఆమెను బర్తరఫ్ చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం వల్ల ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను పక్కదోవ పట్టించడానికి హైడ్రా పేరుతో హైడ్రామా చేస్తున్నారు.

సివిల్ సప్లయి కార్మికుల వేతనాలు పెంపుపై హర్షం

ఎదులాపురం, అక్టోబర్ 4 : సివిల్ సప్లయి కార్మికుల వేతనాలు పెంచడంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించేల సివిల్ సప్లయి కమిషనర్ హామీ ఇవ్వడంపై ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్ హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయమై శుక్రవారం ఆదిలాబాద్‌లోని తెలంగాణచౌక్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి సిర్ర దేవేందర్, సివిల్ సప్లయి హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ అప్రోజ్, జిల్లా నాయకులు లక్ష్మీపతి, సలీం, జమ్ము, విశాల్, గంగన్న పాల్గొన్నారు.

లోక కల్యాణం కోసమే నవ కుండాత్మక చండీయాగం

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 4: లోక కల్యాణం కోసమే నిర్మల్‌లోని బంగల్‌పేట్ కాలనీలోని రాజశ్యామల అమ్మవారి ఆలయంలో దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నవ కుండాత్మక చండీ యాగాన్ని తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు శివరాజయోగి కృష్ణ స్వామి అన్నారు. ఆలయ ప్రాంగణంలో చేపడుతున్న యాగం శుక్రవారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. వీటితో పాటు ఒకే మండపంలో కొలువైన అష్టాదశ శక్తి పీఠాలకు అమ్మవారి పూజ, దశ సంహిక చండీ ఆరాధన, కుంకుమార్చన, హారతి, రాత్రి 11.30 నిమిషాలకు నక్షత్ర హారతి వంటి పూజలను నిర్వహించడం జరుగుతుందని భక్తులు హాజరుకావాలని తెలిపారు.

పొగాకు వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన

మాట్లాడుతున్న సైకాలజిస్ట్ శ్రీకాంత్

ఎదులాపురం, అక్టోబర్ 4: పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం సైకాలజిస్ట్ శ్రీకాంత్ అన్నారు. నేషనల్ టోబాకో ఫ్రీ యూత్ 2.0 క్యాంపెన్‌లో భాగంగా పట్టణంలోని పూత్లిబౌలి ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగ తాగడం, గుట్కా, తంబాకు వాడకం వలన గుండెపోటు, గొంతు క్యాన్సర్, నోటి క్యాన్సర్ ఎముకల క్యాన్సర్ వెంటాడుతాయని హెచ్చరించారు. పొగాకు ఉత్పత్తుల వాడకం తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమ సమన్వయకర్తలు వెంకటరమణ, శ్రీనివాస్, సోషల్ వర్కర్ చిరంజీవి, దవాఖాన సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు

బ్రహ్మచారిణి అవతారంలో అమ్మవారు

బాసర, అక్టోబర్ 4 : బాసర సరస్వతీ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. రెండవ రోజు శుక్రవారం సరస్వతీ అమ్మవారు బ్రహ్మచారిణి రూపంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి పులిహోర నైవేద్యంగా సమర్పించారు. అర్చకులు అమ్మవారి క్షేత్రంలో అంకురార్పన, నివేదన హారతి, చతుర్వద సేవలు, తదితర పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

భక్తి మార్గమే మోక్ష మార్గం

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్
- కుంటాల(కే)లో జగదాంబదేవి, సేవాలాల్ ఆలయాల నిర్మాణాలకు భూమిపూజ

నేరడిగొండ: కుంటాల(కే)లో పనులు ప్రారంభిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, అక్టోబర్ 4 : భక్తి మార్గమే మోక్ష మార్గమని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శుక్రవారం కుంటాల(కే) గ్రామంలోని జగదాంబ దేవి, సేవాలాల్ మహారాజ్ ఆలయాల నిర్మాణాలకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎన్నో ఆలయాలను నిర్మించిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. అనంతరం చిన్న బుగ్గారం గ్రామంలో జగదాంబదేవి ఆలయం వద్ద నూతన మండప నిర్మాణ పనులను ప్రారంభించారు. కుంటాల ఆలయాల నిర్మాణానికి రూ.43 లక్షలు, చిన్న బుగ్గారంలోని మండప నిర్మాణానికి రూ.12 లక్షలతో నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యేను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, బీఆర్ఎస్ నాయకులు అంబేకర్ పండరి, రాథోడ్ సురేందర్, బాబులాల్, సద్దాం, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

గుడిహత్నూర్, అక్టోబర్ 4 : మల్కాపూర్ గ్రామానికి చెందిన మడావి దశరథ్ ఇల్లు దగ్ధం కావడంతో శుక్రవారం ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఆయన ఇంటికి వెళ్లి పరిశీలించారు. తక్షణ సహాయం కింద రూ.5వేలు అందజేశారు.ప్రభుత్వ సహకారం అందేవిధంగా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

డీఎస్సీ అభ్యర్థికి సన్మానం

బోథ్, అక్టోబర్ 4 : మండల కేంద్రానికి చెందిన శ్రావ్యరాణిని శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ సన్మానించారు. ఇటీవల వెల్లడైన డీఎస్సీ ఫలితాల్లో జిల్లా స్థాయిలో 27వ ర్యాంకు సాధించడం పట్ల అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చదివి ఎంపిక కావడం అభినందనీయం

తాంసి, అక్టోబర్ 4 : ఎటువంటి కోచింగ్ లేకుండా కప్పర్ల గ్రామ గ్రంథాలయంలో చదివి ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపిక కావడం అభినందనీయమని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో 66వ ర్యాంకు సాధించిన కప్పర్ల గ్రామానికి చెందిన కడదరపు గంగాసాగర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా కప్పర్ల గ్రామ గ్రంథాలయానికి నిర్వహణ ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు విరాళం అందించారు. ఈ మేరకు గ్రంథాలయ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కౌడాల మహేందర్, వీడీసీ చైర్మన్ బొజ్జ అశోక్, గ్రంథాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పద్మశాలీల సంక్షేమం కోసం పాటుపడుతా

మాట్లాడుతున్న జిల్లా మాజీ అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ

ఎదులాపురం, అక్టోబర్ 4 : పద్మశాలీల సంక్షేమం కోసం తన వంతుగా కృషి చేస్తూ ఉంటానని పద్మశాలీ సంక్షేమ సంఘం జిల్లా మాజీ అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా అధ్యక్షురాలిగా గత నెల 26తో పదవీకాలం పూర్తయిందన్నారు. జిల్లా సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో నూతనంగా ఆదిలాబాద్ జిల్లా కమిటీని ఏర్పాటు చేయాలని ఇటీవల ఎన్నికైన రాష్ట్ర కమిటీ సభ్యులను కోరారు. సమావేశంలో నాయకులు, కోశాధికారి బాస దత్తు, ఉపాధ్యక్షులు కొక్కుల అడెల్లు, పెంట వెంకన్న, ప్రచార కార్యదర్శులు పోతు గణేశ్, సంతోష్, సోషల్ మీడియ కన్వీనర్ కుర్ర నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం- పరిశుభ్రత పాటించాలి

బోథ్, అక్టోబర్ 4 : గ్రామాల్లో పచ్చదనం- పరిశుభ్రత పాటించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి, మండల ప్రత్యేకాధికారి వాజిద్ అలీ సూచించారు. శుక్రవారం బోథ్‌లోని రైతు వేదికలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం టీఏ, ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. ఇటీవల పూర్తయిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ వేదికలో వెల్లడైన విషయాలపై చర్చించారు. సమావేశంలో ఎంపీడీవో జీవన్‌రెడ్డి, ఏపీవో జగ్దేరావ్ పాల్గొన్నారు.

తాగునీటి నాణ్యతపై అవగాహన

ఇచ్చోడ, అక్టోబర్ 4 : సిరికొండలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. శుక్రవారం మిషన్ భగీరథ ఏఈఈ జైపాల్ అవగాహన కల్పించారు. ఆర్‌వో నీరు తాగడం వల్ల కలిగే నష్టాన్ని పరీక్షించి చూపించారు. మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో నీటి నాణ్యత నిపుణులు తిరుపతి, రావుఫ్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నర్సాపూర్ (జీ), అక్టోబర్ 4 : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీవో తిరుపతి రెడ్డి అన్నారు. శుక్రవారం రాంపూర్, నర్సాపూర్, కుస్లి, చాక్‌పల్లి, నందన్, గొల్లమాడతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం పైడే డైడే కార్యక్రమం నిర్వహించారు. పలు ఇళ్ల ముందు కుండీల్లోని నిల్వ నీటిని పారబోయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో తిరుపతి రెడ్డి, ఆశకార్యకర్తలు, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు రాథోడ్ కైలాస్, నవనీత్ కుమార్, కృష్ణ, నరేశ్ కుమార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ కమిటీలు రద్దు

భైంసా, అక్టోబర్ 4 : నిర్మల్ జిల్లాలో ఎన్ఎస్‌యూఐ కమిటీలను రద్దు చేస్తున్నట్లు మాజీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు అమ్జద్ షేక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి మండల, తాలూకా కమిటీలను రద్దు చేస్తున్నట్లు రాష్ట్ర బాధ్యులు ఎండీ ఫరాన్, ప్రతీక్ సింగ్ ఆదేశాల మేరకు రద్దు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఒకరికి జైలు శిక్ష

కడెం, అక్టోబర్ 4 : నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తొమ్మిదేళ్ల చిన్నారి మృతికి కారణమైన కేసులో ఒకరికి జైలు శిక్ష విధిస్తున్నట్లు ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. 2019లో జన్నారం మండలం జువ్విగూడ గ్రామానికి చెందిన పవార్ భరత్ (9) అనే చిన్నారి మృతికి కారణమైన మండలంలోని లక్ష్మీసాగర్ గ్రామానికి చెందిన గుగ్లావత్ శ్రీనివాస్‌కు ఏడు రోజుల జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధించినట్లు ఖానాపూర్ కోర్టు మెజిస్ట్రేట్ జతిన్‌కుమార్ తెలిపినట్లు ఆయన తెలిపారు.

గోడ్డలితో దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు

ఇంద్రవెల్లి, అక్టోబర్ 4 : మెండపల్లి గ్రామానికి చెందిన దోనకొండ నరేశ్‌పై గోడ్డలితో దాడి చేసిన ముత్నూర్ గ్రామానికి చెందిన వాగ్మారే కిషన్, వాగ్మారే విష్ణుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. మెండపల్లి గ్రామానికి చెందిన దోనకొండ వెంకటి, తన కుమారుడు నరేశ్‌లు ముత్నూర్ గ్రామంలోని బస్టాండులో ఉన్నారు. ముత్నూర్ గ్రామానికి చెందిన వాగ్మారే కిషన్, వాగ్మారే విష్ణులు పాతకక్షల కారణంగా ఇద్దరు కలిసి దోనకొండ నరేశ్‌పై గొడ్డలితో దాడి చేశారు. నరేశ్ తండ్రి వెంకటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

భైంసా, అక్టోబర్ 4 : ఒక వర్గాన్ని సంతృప్తి పరిచేందుకు పోలీసులు హిందువులపై అక్రమ కేసులు పెడుతున్నారని హిందు ధర్మ పరిరక్షణ సమితి, భైంసా నాయకులు ఆరోపించారు. అక్రమ కేసులు ఎత్తివేయాలంటూ శుక్రవారం పట్టణంలోని ఏఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ అవినాశ్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

విధులు బహిష్కరించిన మున్సిపల్ కార్మికులు

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 4 : నిర్మల్ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు వేతనాలు చెల్లించక పోవడంతో నాలుగు రోజులుగా విధులకు స్వస్తి పలికారు. శుక్రవారం కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. మున్సిపల్ కార్మికులకు బీఎస్పీ నాయకులు జగన్‌మోహన్ మద్దతు తెలిపారు. కార్మికుల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

దుర్గాదేవికి మాజీ జడ్పీటీసీ పూజలు

తలమడుగు, అక్టోబర్ 4 : రుయ్యాడి గ్రామంలో సర్వజని దుర్గా మండలి, హస్సేన్ హుస్సేన్ శారద మాత మండలి వారు ప్రతిష్ఠించిన దుర్గాదేవిని శుక్రవారం మాజీ జడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కత్తెర్ల లస్మన్న కిరాణా దుకాణాన్ని ప్రారంభించారు. గ్రామానికి చెందిన పిట్ల నాగరాజు కుమారుని నామకరణంలో పాల్గొన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ వెంకన్న, లోక ప్రవీణ్ రెడ్డి, వెంకటేశ్, సాంబశివ్, బాలాజీ, దివాకర్, రాకేశ్, మోహన్, మహేందర్, మాజీ విద్యా కమిటీ చైర్మన్ గంగన్న, సాయికిరణ్, రావుల నారాయణ, గ్రామస్తులు ఉన్నారు.

బాధితులకు పరామర్శ

రుయ్యాడి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు అశోక్, సామల సాంబశివ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన శ్యామల విఠల్ అనారోగ్యంతో బాధపడుతుండగా వారిని పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ బాబన్న ఉన్నారు.

సాయిలింగిలో వీరజవాన్ జయంతి

తలమడుగు, అక్టోబర్ 4 : సాయిలింగి వృద్ధాశ్రమంలో శుక్రవారం తాంసి మండలం పొన్నారి గ్రామానికి చెందిన వీర జవాన్ దాసరి నవీన్ 30వ జయంతి వృద్ధుల సమక్షంలో నిర్వహించారు. వృద్ధులకు మిఠాయిలు పంచి అన్నదానం చేశారు. మొదటగా వీర జవాన్ దాసరి నవీన్ తల్లిదండ్రులు దాసరి సువర్ణ, స్వామి, పొన్నారి గ్రామంలోని వీర జవాన్ దాసరి నవీన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలోదాసరి నవీన్ అన్నయ్య దాసరి ప్రవీణ్, ప్రశాంత్, నారాయణ, గణేశ్, నరేశ్, విష్ణు, సాయిపవన్ పాల్గొన్నారు.

ఎల్ ఆర్ఎస్ భూములపై సర్వే

ఇచ్చోడ(సిరికొండ), అక్టోబర్ 4: సిరికొండలోని ఎల్ఆర్ఎస్ (లే అవుట్ భూమ క్రమబద్ధీకరణ పథకం)లో భాగంగా శుక్రవారం తహసీల్దార్ తుకారాం ఆధ్వర్యంలో ఖాళీ స్థలాలను సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో లే అవుట్ల క్రమ బద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు సేకరిస్తున్నామన్నారు. ఖాళీ పట్లలో అక్రమ నిర్మాణం నిర్మించుకున్న వారికి క్రమబద్ధీకరించడం కోసం ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, ఆర్ఐ విలాస్, జూనియర్ అసిస్టెంట్ వసంత్, కార్యదర్శి అరుణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు రైతులకు అందేలా చూడాలి

కల్యాణమండపాన్ని ప్రారంభిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా, అక్టోబర్ 4 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పథకాలు రైతాంగానికి అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం భైంసాలోని ఎమ్మెల్యే నివాసంలో వ్యవసాయాధికారులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ఆరా తీశారు. అదేవిధంగా రుణమాఫీ ఇతర అంశాలపై చర్చించారు. గ్రామాల్లో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ఎప్పటికప్పుడు పంట క్షేత్రాలు పరిశీలించేలా చూడాలని ఆదేశించారు. అంతేగాకుండా శనివారం నుంచి ఉదయం 10 గంటలకు భైంసాలో, 11 గంటలకు కుభీర్ ప్రాథమిక సహకార కేంద్రాల్లో సోయాబీన్ కొనుగోళ్లు ప్రారంభమవుతాయన్నారు. 12 శాతం తేమతో రైతులు పంటను తీసుకురావాలని, క్వింటాల్‌కు రూ.4892 మద్దతు ధర ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి అంజి ప్రసాద్, ఏడీఏ వీణ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం భైంసాలోని సాయిబాబా గుట్టపై గల కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 36 లక్షలతో కల్యాణమండపం నిర్మించామని మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్ బాబు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ఉట్నూర్, అక్టోబర్ 4: చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐటీడీఏ ఏపీవో వసంతరావ్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్‌లోని కుమ్రం భీం సమావేశ మందిరంలో పెసా చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెసా చట్టం ద్వారా కల్పించిన హక్కులను పటిష్టంగా గ్రామాల్లో అమలు చేసేందుకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామాల అభివృద్ధికి పెసా కోఆర్డినేటర్లు వారదిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, జిల్లా పెసా కోఆర్డినేటర్ వసంత్‌రావ్, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331783-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

7న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలి

ఇంద్రవెల్లి, అక్టోబర్ 4 : ఐటీడీఏ పరిధిలోని భూ సమస్యల పరిష్కరంతో పాటు జైనూర్ ఘటనకు నిరసనగా ఈ నెల 7వ తేదీన ఐటీడీఏ ఎదుట ఆదివాసీల తొమ్మిది తెగల ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని తుడుందెబ్బ మండలాధ్యక్షుడు పుర్కా చిత్రు పిలుపుచిచ్చారు. శుక్రవారం ఇంద్రవెల్లిలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. ఏజెన్సీలోని భూ సమస్యల పరిష్కరంతో పాటు ఐటీడీఏ పరిధిలో ఉన్న అధికారులకు చెందిన అధికారాలను కలెక్టర్‌కు అప్పగించిన హైకోర్టు తీర్మానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి సోయం రాందాస్, ఉపాధ్యక్షుడు గేడం భరత్, ఆదివాసీల తొమ్మిది తెగల సమన్వయ కమిటీ కార్యదర్శి కోట్నాక్ బారిక్‌రావ్, తుడుందెబ్బ మండల గౌరవాధ్యక్షుడు జుగ్నాక్ భారత్, ఉపాధ్యక్షుడు సోయం వినోద్, కార్యదర్శి సోయం మురహరి, కోశాధికారి మెస్రం జయరాం, ఆదివాసీ సంఘాల నాయకులు ఇంద్రదేవ్, లచ్చు, నాగోరావ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 4 : రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు నిర్మల్‌కు చెందిన విద్యార్థులు ఎంపిక య్యారు. ఈ నెల 2వ తేదీన నిర్మల్ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన జోనల్ స్థాయి(ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి) అండర్-14 ఎస్జీఎఫ్ క్రికెట్ టోర్నమెంట్‌లో లక్కి క్రికెట్ అకాడమీకి చెందిన గౌరికర్ నీరజ్, ఎస్కే ఫార్జాన్ ప్రతిభ కనబరిచారు. ఈ నెలలో మహబూబ్‌నగర్‌లోని గద్వాలలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను లక్కి క్రికెట్ అకాడమీ కోచ్ బేర సుదర్శన్, కుటుంబ సభ్యులు అభినందించారు.

ఖానాపూర్, అక్టోబర్ 4 : ఖానాపూర్‌కు చెందిన గౌరికర్ నీరజ్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక య్యారు. ఈ నెల 2వ తేదీన నిర్మల్‌లో స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 పోటీల్లో ఆల్‌రౌండర్‌గా ప్రత్యేక ప్రతిభ చూపినట్లు ఆయన తల్లిదండ్రులు తెలిపారు. నీరజ్ ప్రస్తుతం నిర్మల్‌లోని వాసవి వరల్డ్ ప్రైవేట్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. రాష్ట్ర స్థాయిలో ఈ నెల 7 నుంచి మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే పోటీలకు ఎంపిక చేసినట్లు వివరించారు. ఇందులో నీరాజ్‌కు స్థానం లభించడంతో స్థానికులు, క్రీడాకారులు అభినందించారు.

నేటి నుంచి గంగనీళ్ల జాతర

నిర్మించిన అడెల్లి పోచమ్మ ఆలయం

సారంగాపూర్, సెప్టెంబర్ 4 : నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని శ్రీ మహా అడెల్లి పోచమ్మ గంగనీళ్ల జాతర